క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 10న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. నయీంనగర్, కిషన్‌పుర, సమ్మయ్యనగర్, సరస్వతి నగర్, కుడా కాలనీ, శంకర్ నగర్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, రెడ్డి కాలనీ, పాల జెండా, బుద్ధ భవన్, కుమార్‌పల్లి ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, రాంపూర్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు ఆడియో సీడీ ఆవిష్కరణ

విద్యారణ్యపురి: 'దేశ ప్రజల ఆశయాల అంతరంగం – మన భారత రాజ్యాంగం'పై కవి, ప్రజా కళాకారుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వల్లంపట్ల నాగేశ్వర్‌రావు పాటను రచించారు. ఈమేరకు సంబంధిత ఆడియో సీడీని హనుమకొండలోని సుబేదారి ఎక్సైజ్‌కాలనీలోని ఎమ్మెల్యే కడియం శ్రీహరి నివాసంలో ఎంపీ కడియం కావ్య గురువారం ఆవిష్కరించనున్నట్లు నాగేశ్వర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్, సాహితీవేత్త, ప్రొఫెసర్ బన్న అయిలయ్య తదితరులు పాల్గొంటారని తెలిపారు.

నేడు కాజీపేటలో కిడ్నీ వైద్య శిబిరం

కాజీపేట: కాజీపేట పట్టణంలోని లతా వెంకట్ ఆర్థో అండ్ జనరల్ ఆస్పత్రిలో గురువారం ఉచిత కిడ్నీ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు డాక్టర్ కొలిపాక వెంకటస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు, 50ఏళ్లు పైబడిన వారు, మూత్ర సమస్యలతో బాధపడుతున్న వారు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 95024 05555 నంబర్‌కు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

25నుంచి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర 5వ మహాసభలు



కేయూ క్యాంపస్: ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ఐదో మహాసభలను ఈనెల 25, 26, 27వ తేదీల్లో ఖమ్మంలో నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ పిలుపునిచ్చారు. ఈమేరకు హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్అండ్ సైన్స్ కళాశాలలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ అంజన్‌రావుతో కలిసి వాల్‌పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బిరెడ్డి జస్వంత్, బాధ్యులు ఈశ్వర్, సందీప్, రాజ్‌కుమార్, అనూష, మౌనిక, ప్రవళిక, హర్షసాయి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూత



హసన్‌పర్తి: 65వ డివిజన్ దేవన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్న 35 మంది నిరుపేద విద్యార్థులకు పుల్లా కో ఫౌండర్ రైస్ లవ్ ఆర్గనైజేషన్ చేయూతనిచ్చింది. ఈమేరకు ఒక్కో విద్యార్థికి 25 కిలోల బియ్యం బ్యాగ్‌ను అందజేసింది. పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ దివ్యారాణి మాట్లాడుతూ ఆర్గనైజేషన్ చేస్తున్న సేవలను కొనియాడారు. నిరుపేద విద్యార్థులకు బియ్యం అందించడం అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో నిర్వాహకులు టీవీఎస్ రత్నరాజ్, రిత్విక్, మండల విద్యాశాఖ అధికారి రాజిరెడ్డి, విద్యా కమిటీ చైర్‌పర్సన్ సునీత, ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఉపాధ్యాయులు గుండు ప్రభాకర్, సురేఖ పాల్గొన్నారు.

ఉద్యోగులు పని ఒత్తిడిని అధిగమించాలి



కాజీపేట రూరల్: నేటి ఉరుకుల పరుగుల జీవనంలో ఉద్యోగులు తమ విధి నిర్వహణలో పని ఒత్తిడిని అధిగమించుకుంటూ ముందుకు సాగాలని పీహెచ్‌డీ స్కాలర్ అండ్ స్పిర్చ్యువల్ మోటివేషనల్ స్పీకర్ బ్రహ్మకుమార్ రంజన్‌కుమార్ సూచించారు. కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో కాజీపేట డీజిల్‌కాలనీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం బ్రహ్మకుమారి శాఖ ఆధ్వర్యంలో మెంటల్ హెల్త్ అండ్ వెల్ బీయింగ్ సెమినార్ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా రంజన్‌కుమార్ మాట్లాడుతూ అనేక ఒత్తిడిలను దూరం చేసేందుకు నీటి థెరపీ, ఆహార జ్ఞానం, శబ్ద చికిత్స, అధ్యాత్మిక సాధనలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో కాజీపేట రైల్వే డీజిల్‌షెడ్ ఏసీఎంటీ రవీందర్ కుమార్, ఎలక్ట్రిక్ లోకోషెడ్ ఏడీఈఈ ఎస్ఎస్.ఫణికుమార్, రైల్వే చీఫ్ వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ సరళ మాధవి, బ్రహ్మకుమారి అనూష పాల్గొన్నారు.

కుండీలు సరే.. మొక్కలేవి?

- మూడేళ్ల క్రితం ఏర్పాటు
- పట్టించుకోకపోవడంతో కళావిహీనంగా మారిన వైనం



ఎదుగుదల లేని మొక్క



పగిలిపోయిన కుండీ



అలంకారప్రాయంగా ఉన్న కుండీలు

కాజీపేట: ట్రైసిటీలో ఒకటిగా పిలువబడే కాజీపేట పట్టణం ప్రధాన రహదారి డివైడర్లపై ఉన్న కుండీల్లోని మొక్కలు ఎండిపోయి చూపరులకు కళావిహీనంగా కనిపిస్తున్నాయి. మూడేళ్ల క్రితం సీఎం కేసీఆర్ జిల్లా పర్యటనకు వస్తున్నట్లు సమాచారం అందుకున్న అధికారులు హడావిడిగా రూ.లక్షలు ఖర్చు చేసి అందమైన కుండీలు ఏర్పాటు చేశారు. ఆగమేఘాల మీద నర్సరీల నుంచి మొక్కలను తెచ్చి పదిమంది మెచ్చేలా మొక్కలను నాటి చేతులు దులుపుకున్నారు. ఆ తర్వాత వాటి నిర్వహణను మున్సిపల్ అధికారులు మరిచిపోవడంతో క్రమేపీ కుండీల్లోని మొక్కలు నీరులేక పూర్తిగా ఎండిపోయాయి. సిబ్బంది పర్యవేక్షణతో పాటు సంరక్షణ కొరవడడంతో మొక్కలు సరిగ్గా పెరగకుండా పోయాయి. ప్రధాన రహదారి పొడవునా ఏర్పాటు చేసిన వాటిలో సగానికి పైగా కుండీలు వివిధ కారణాలతో పగిలిపోయాయి. కుండీలు పగిలిపోయి, మొక్కలు ఎండిపోవడంతో పచ్చదనం కోసం ఏర్పాటు చేసిన గార్డెన్ కళావిహీనంగా తయారైంది. ఆకర్షణీయ పట్టణంలో భాగంగా సుందరీకరణకు భారీగా వ్యయం చేస్తున్నా నిర్వహణ సరిగాలేని కారణంగా ఈ దుస్థితి ఏర్పడింది. పగిలిపోయిన కుండీలు, ఎండిపోయిన మొక్కలను అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రతినిత్యం చూస్తూ దృష్టి సారించకపోవడం బాధాకరమని పట్టణ వాసులు అంటున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి కుండీల నిర్వహణపై ఆసక్తి కనబరిచి మొక్కలను నాటించాలని ప్రకృతి ప్రేమికులు అభ్యర్థిస్తున్నారు.

సమస్యలపై సీపీఎం ఇంటింటి సర్వే



సుర్జీత్‌నగర్‌లో సర్వే చేస్తున్న నాయకులు



కాజీపేట: సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం న్యూశాయంపేటలోని సుర్జీత్‌నగర్‌లో సీపీఎం జిల్లా నాయకుడు కారు ఉపేందర్ ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలిక వసతులు కల్పించాలని, ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలివ్వాలని, కరెంట్ మీటర్ల సౌకర్యం కల్పించాలని కాలనీవాసులు కోరినట్లు ఉపేందర్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కురుకు రంజిత్, రమేష్, సదానందం, వనమాల, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాన్యాతండాలో పాదయాత్ర

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ ఆర్ఈసీ నాన్యాతండాలో సీపీఎం కార్యకర్తలు బుధవారం పాదయాత్ర నిర్వహించారు. కొంతకాలం క్రితం స్థానిక కార్పొరేటర్ ఎలకంటి రాములు మృతి చెందిన తర్వాత పట్టించుకునే వారు లేక కాలనీలో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయి. వాటి అధ్యయనం కోసం మండల పార్టీ కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య ఆధ్వర్యంలో కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై కాలనీవాసులతో చర్చించారు. సర్వేలో మండల కమిటీ సభ్యులు తొట్టె మల్లేశం, జంపాల రమేష్, కొల్లూరి కుమార్, ఎడ్ల మేరీ, బానోతు అజయ్, భూదేవి తదితరులు పాల్గొన్నారు.

'ఆటిజం' పెరగకుండా చూడాలి



చిన్నారులతో కమిషన్ సభ్యురాలు గోగుల సరిత, తదితరులు

హన్మకొండ అర్బన్: ఆటిజం పెరగకుండా చూడటం ప్రతీఒక్కరి బాధ్యత అని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు గోగుల సరిత అన్నారు. ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం సందర్భంగా నగరంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆటిజం అనేది మేధో సంబంధమైన సమస్య అని వివరించారు. గర్భధారణ సమయంలో తల్లులు తీవ్రమైన ఉద్వేగాలు, ఒత్తిడికి లోనుకావడం వల్ల ఇలాంటి పిల్లలు పుడతారని తెలిపారు. పిల్లల్లో ఆటిజం ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే కొన్ని ప్రత్యేక ముందస్తు చర్యల ద్వారా వారిలో మార్పు తీసుకురావచ్చని అన్నారు. ఇలాంటి వారికి మల్లికాంబ మనోవికాస కేంద్రం చేస్తున్న సేవలు గొప్పదని కొనియాడారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కూచన రవళిరెడ్డి, మల్లికాంబ కేంద్రం నిర్వాహకురాలు బండా రామలీల, కోడం కల్యాణ్, ప్రభుత్వ డీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ గోవర్ధన్, సెయింట్ ఆన్స్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కాత్యాయని, లా కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ పద్మ, మల్లికాంబ చిన్నారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై పోరాటం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

ఖిలా వరంగల్: బీజేపీ బలోపేతంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారం కోసం ప్రజలతో మమేకమై నాయకులు, కార్యకర్తలు పోరాటం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ వన్నాల వెంకటరమణ సూచించారు. ఖిలా వరంగల్ పడమర కోటలో పార్టీ నేత ఇనుముల అరుణ్ అధ్యక్షతన పార్టీ బలోపేతంపై కార్యకర్తల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ త్రికోటలో తాగునీటి సమస్య, గుండు చెరువులో రాణి రుద్రమదేవి విగ్రహం పునఃప్రతిష్ఠాపన, కాకతీయ మ్యూజియం ప్రారంభం, అగర్త చెరువు అభివృద్ధి, బొడ్రాయి వద్ద చిల్డ్రన్ పార్క్ ఏర్పాటు కోసం ప్రజలతో కలిసి పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్, జనార్దన్, చంద్రమోహన్, నగేష్, నర్సింగం, రాజు, స్వర్ణ, రాజేశ్వరి, శ్రీను, మహేందర్, మున్నా, రమేష్, నందు, మూర్తి, కిరణ్, అనిల్, సాయి, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ఖిలా వరంగల్: బూత్ స్థాయి నుంచే బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ కోరారు. వరంగల్ శివనగర్‌లో 34వ డివిజన్ అధ్యక్షుడు మహమ్మద్ రఫీ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా రవికుమార్ మాట్లాడుతూ పార్టీ 65 ఏళ్లలో అభివృద్ధి చెందిన విధానాన్ని వివరించారు. మరింత బలోపేతం చేయడానికి పలు సూచనలు చేశారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న కార్మికులు

ఎంజీఎం: కాకతీయ వైద్య కళాశాల హాస్టళ్లలో శానిటరీ వర్కర్లు, సెక్యూరిటీ సిబ్బంది పెండింగ్‌లో ఉన్న 9 నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని కాకతీయ వైద్య కళాశాల హాస్టల్స్ వర్కర్స్ (సీఐటీయూ అనుబంధ) నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కేఎంసీ పరిపాలన భవనం ఎదుట బుధవారం భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్ వేతనాల చెల్లింపుపై గత నెలలో 80 మంది సిబ్బంది సమ్మెకు దిగగా, అధికారుల భరోసా మేరకు తాత్కాలికంగా సమ్మె విరమించినట్లు గుర్తుచేశారు. సమ్మె విరమించి 30 రోజులైనా జీతాలు జమ కాలేదని వాపోయారు.

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి



ర్యాలీలో అధ్యాపకులు, విద్యార్థులు

హన్మకొండ: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని వాగ్దేవి విద్యాసంస్థల కార్యదర్శి సీహెచ్.దేవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఏప్రిల్ 7 ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల మహిళా సాధికారిత విభాగం, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో న్యూట్రిజెన్ 2కె25 మారథాన్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. గర్భిణులు బలవర్ధకమైన ఆహారం తీసుకుంటేనే ఆరోగ్యవంతులైన పిల్లలు జన్మిస్తారని చెప్పారు. ర్యాలీలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ సీహెచ్.వాహిణి దేవి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.శేషాచలం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హరీందర్ రెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జి.రాజాప్రసాద్, డీన్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ డాక్టర్ జి.విక్రమ్, మహిళా సాధికారత సెల్ కన్వీనర్లు కె.హిమబిందు, ఎస్.రజిత, డైట్ అండ్ డిలైట్ క్లబ్ కన్వీనర్ ఎం.లక్ష్మి పూజిత, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

టీజీసెట్ నోటిఫికేషన్ ఇవ్వాలి

కేయూ క్యాంపస్: టీజీసెట్ –2025 నోటిఫికేషన్ విడుదల చేయాలని పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పీజీ కోర్సులు పూర్తిచేసిన అనేక మంది విద్యార్థులు టీజీసెట్ కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. సమావేశంలో జిల్లా కమిటీ బాధ్యులు రమేష్, పవన్‌కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలి

హన్మకొండ: వేసవిలో పోషకాలతో కూడిన సాత్విక ఆహారంతో పాటు ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవడం ద్వారా డీహైడ్రేషన్ బారిన పడకుండా శరీరాన్ని కాపాడుకోవచ్చని మిల్లెట్ హబ్ నిర్వాహకురాలు కుసుమ కవిత సూచించారు. హనుమకొండ హనుమకొండ సర్క్యూట్ హౌజ్ రోడ్డులోని స్పందన మానసిక వికలాంగుల ఆశ్రమంలో 'పౌష్టికాహారం ప్రాముఖ్యత' అనే అంశంపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శరీరానికి చలువ చేసే జావను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మిల్లెట్ ప్రమోటర్ నిమ్మల శ్రీనివాస్, స్పందన ఆశ్రమ నిర్వాహకురాలు సుచరిత రెడ్డి, ఉపాధ్యాయులు వసుధ, హరిత, అలేఖ్య, భార్గవి పాల్గొన్నారు.

బీసీల గురించి మాట్లాడే హక్కు కవితకు లేదు

కేయూ క్యాంపస్: మహాత్మా జ్యోతిరావుపూలే గురించి, బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు ఎమ్మెల్సీ కవితకు లేదని గౌడ్ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆరెగంటి నాగరాజు అన్నారు. కాకతీయ యూనివర్సిటీ గెస్ట్ హౌజ్‌లో మీడియా సమావేశంలో బుధవారం మాట్లాడారు. మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఇందిరా పార్కువద్ద కల్వకుంట కవిత మంగళవారం దీక్ష చేయడం శోచనీయమన్నారు. ఈ సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు శాగంటి సుమన్, ఉపాధ్యక్షుడు అజయ్‌సింగ్, బాధ్యులు రవితేజ, భీమన్న, అన్వేష్, గణేష్, కిరణ్‌గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

నాగభూషణం ఆశయాలు కొనసాగిస్తాం

వరంగల్: టీపీటీఎఫ్ నాయకుడు, ఉద్యమ నేత పెద్దోజు నాగభూషణం ఆశయాలను కొనసాగిస్తామని జిల్లా అధ్యక్షుడు అశోక్ అన్నారు. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ వరంగల్ జిల్లా శాఖ కార్యాలయంలో పెద్దోజు నాగభూషణం సంతాప సభను బుధవారం నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి, రాష్ట్ర, జిల్లా నాయకులు కొండల్‌రెడ్డి, హనుమాన్లు, శ్రీనివాసులు, రమేష్, పురుషోత్తం, మల్లయ్య, రామబ్రహ్మాచారి, కృష్ణయ్య, వినయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలి

మడికొండ: ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ బహిరంగ సభను విజయవంతం చేయాలని 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికరెడ్డి కోరారు. ఈమేరకు డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జ్ పోలెపల్లి రాంమూర్తి, నాయకులు రవీందర్, ముప్పిడి శివ, బోగి శ్రీనివాస్, దేవేందర్, వెంకటస్వామి పాల్గొన్నారు.

శ్వేతార్క ఆలయంలో జిల్లా జడ్జి పూజలు

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రాన్ని జిల్లా జడ్జి రమేష్ బాబు దంపతులు దర్శించారు. జడ్జికి ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం, ఆలయంలోని 29 దేవతామూర్తులను జడ్జి దంపతులు దర్శించుకుని పూజలు చేశారు.

కట్టమైసమ్మ తల్లి ప్రతిష్ఠాపన

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం మడికొండలో మడికొండ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఉపద్రష్ట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో కట్ట మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనను బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో కొడకండ్ల భాస్కరాచార్య, సురేష్, ఎల్లయ్య, శ్రీను స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఐజేయూ జిల్లా కమిటీ ఏకగ్రీవం

ఖిలా వరంగల్: ఐజేయూ వరంగల్ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీరాం రాంచందర్, ఉపాధ్యక్షులుగా జన్ను స్వామి, కుర్న వెంకటేశ్వర్లు (వెంకన్న), మహాదేవుని జగదీష్, ప్రధాన కార్యదర్శిగా మట్టా దుర్గాప్రసాద్, కోశాధికారిగా కోదాటి గోపాలకృష్ణ, జాయింట్ సెక్రటరీగా బొమ్మగాని సతీష్, చింతనూరి రాజుతో పాటు 13మంది కార్యవర్గ సభ్యులు ఎన్నుకున్నారు.

వేధిస్తున్న యువకుడిపై చర్య తీసుకోవాలి

వరంగల్: ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న తమ కుమార్తె సిరివెన్నెలను వేధిస్తున్న ఆకాశ్, అతడి తల్లి స్వప్నపై చర్యలు తీసుకోవాలని ఇంతేజార్‌గంజ్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వరంగల్ ఎస్ఆర్‌తోటకు చెందిన గౌడ వరలక్ష్మి, శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి నెలలో ఇంటర్ పరీక్ష రాసి వస్తున్న సిరివెన్నెలను పోచమ్మమైదాన్‌లో అడ్డగించి ఎక్కిన ఆటోలో నుంచి దింపిన స్వప్న.. ఆకాశ్ బైక్‌పై ఎక్కాలని బలవంతం చేసినట్లు పేర్కొన్నారు. ఆకాశ్‌ను పెండ్లి చేసుకోవాలని స్వప్న, ఆమె కుమారుడు వేధిస్తున్నారని తెలిపారు.

పార్టీలో పనిచేయడం గర్వకారణం

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు



ర్యాలీలో ఎమ్మెల్యే నాగరాజు, తదితరులు

మామునూరు: వందల సంవత్సరాల చరిత్ర గల కాంగ్రెస్ పార్టీలో పనిచేయడం తనకు ఎంతో గర్వంగా ఉందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పార్టీ పిలుపులో భాగంగా వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై చింత ప్రకాశ్ ఆధ్వర్యంలో బుధవారం మహా ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా పాలన సాగుతోందని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఈదుల అరుణవిక్టర్, యాదవ్, మన్నె బాబురావు, శివరామకృష్ణ, శివకుమార్, రాజ్‌కుమార్, అనిల్ కరుణాకర్, జాన్సన్ సింగారం అరుణ, రవీందర్, భాస్కర్ పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరిస్తా..

మడికొండ: ఆరు నెలలోపు మడికొండ – రాంపూర్ గ్రామాల మధ్య ఉన్న డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరిస్తామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కర్సన్ నాగరాజు హామీ ఇచ్చారు. డంపింగ్ యార్డు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే నాగరాజును నగరంలో ఆయన నివాసంలో అడ్‌హక్ కమిటీ సభ్యులు బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అడ్‌హక్ కమిటీ సభ్యులు కరుణాకర్ రెడ్డి, రిటైర్డ్ ప్రొఫెసర్ మద్దెల ఎర్రగట్టు స్వామి, పొనగోటి వెంకట్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, దువ్వ నవీన్, పైడిపాల రఘుచంద్, బైరి లింగమూర్తి, గంగారపు రమేష్ పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడకుండా అడ్డుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న ఏసీపీ నందిరాం

- వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్

వరంగల్: బాలలు నేరాలలోకి వెళ్లకుండా అడ్డుకునే ప్రయత్నం చేయడం అత్యంత ముఖ్యమని వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ అన్నారు. అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో ఆటోనగర్ కొత్తవాడలోని ప్రభుత్వ బాలల పరిరక్షణ గృహం (అబ్జర్వేషన్ హోం) ఆవరణలో 'నేడు సమాజంలో బాలల నేరాల నివారణ'పై బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రతీ బాలుడు తన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు గౌరవం ఇవ్వాలని, చెడు స్నేహితుల అనుబంధాలను దూరంగా ఉండాలని అన్నారు. ఒక బాలుడు నేరంలో పాల్గొన్నప్పుడు అతని కుటుంబ సభ్యులు కూడా సమాజంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారని పేర్కొన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మాజీ చైర్మన్ మండల పరశురాములు మాట్లాడుతూ బాలలు నేరాలకు పాల్పడడానికి వారి కుటుంబ పరిస్థితులు, మానసిక సమస్యలు, సమాజంలో అసహాయ బాలల అభివృద్ధి పట్ల ఉండే నిర్లక్ష్యం ప్రధాన కారణాలని అన్నారు. కార్యక్రమంలో అబ్జర్వేషన్ హోం అధికారి వి.శ్రీదేవి, ఉపాధ్యాయులు చందర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కుల అమలుకు పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

హన్మకొండ: సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిబా పూలే, భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్.అంబేడ్కర్ల స్ఫూర్తితో రాజ్యాంగ హక్కులను అమలు కోసం పోరాడాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ పిలుపునిచ్చారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కులో బుధవారం నిర్వహించిన సమావేశంలో డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు చేసుకునేలా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం హనుమకొండ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొమ్ముల కరుణాకర్, గౌరవ అధ్యక్షుడిగా పసుల దాసు, ప్రధాన కార్యదర్శిగా మేకల అనిత, ఉపాధ్యక్షురాలిగా బౌతు రాధ, కార్యదర్శిగా చుంచు నరేష్, గోవింద్ అనిత, కోశాధికారిగా దోమ కొమురయ్య, జిల్లా కమిటీ సభ్యులుగా గోవింద్ ప్రతాప్, ఎడ్ల కోమల, ఆడెపు రమ, స్వరూప, బాగాది కుమార్, సదానందం, రాజు, ప్రశాంత్, కిరణ్, కృష్ణ, భిక్షపతి ఎన్నికయ్యారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, నాయకులు బొర్ర సంపూర్ణ, చిలువేరు భిక్షపతి, మాదాసి సురేష్ పాల్గొన్నారు.

సామాజిక ఉద్యమ నిధి సేకరణ



నిధిని సేకరిస్తున్న సీఐటీయూ నాయకులు

హన్మకొండ చౌరస్తా: సామాజిక న్యాయం కోసం పోరాడిన అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, బాబూ జగ్జీవన్‌రాం, బీటీ రణదేవేలను స్మరించుకుంటూ ఏప్రిల్‌ను మహనీయుల మాసంగా నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా సామాజిక న్యాయ ఉద్యమ నిధిని హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో బుధవారం సేకరించారు. ఈ సందర్భంగా ఆయన రమేష్ మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా కుల వివక్ష భారత దేశంలో ఉందని వాపోయారు. శాస్త్ర, సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందినప్పటికీ అనేక ప్రభుత్వ కార్యాలయాలు, పని ప్రదేశాల్లో ఉద్యోగులు, కార్మికుల మీద వివక్ష ఇంకా కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడకుండా సామాజిక న్యాయాన్ని సాధించలేమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మెట్టు రవి, కళావతి, అనిల్, రాజు, వంశీ, రజని, సబిరా, రమాదేవి, రాధిక పాల్గొన్నారు.

పోషణ్ పక్షోత్సవాలు ప్రారంభం



కాజీపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



ఖిలా వరంగల్: అక్షరాభ్యాసం చేయిస్తున్న రమాదేవి

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ విష్ణుపురిలో పోషణ పక్షోత్సవాలను సోమిడి సెక్టార్ సూపర్‌వైజర్ కవిత బుధవారం ప్రారంభించారు. పోషణ పక్షం ఉత్సవాలను పురస్కరించుకుని అంగన్‌వాడీ కార్యకర్తలు, లబ్ధిదారులు పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ తేరాజ, గీత, ఏఎన్ఎం స్వరూప, ఆశా కార్యకర్తలు లలిత, రూప తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం

ఖిలా వరంగల్: పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా వరంగల్ ప్రాజెక్ట్ ఉర్సు సెక్టార్ ఎస్ఆర్ఆర్ తోటలోని రజక, బీరన్నకుంటలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బత్తిని రమాదేవి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లతో కలిసి అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలను ఆమె నిర్వహించారు. అనంతరం పోషణ పక్షం ప్రతిజ్ఞ చేయించారు. ఆహార నియమాలు, వ్యాధి నిరోధక టీకాలు, తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సునీత, రాధ, శిరీష, యాకోబి, ఆయాలు, మహిళలు పాల్గొన్నారు.

రాంపూర్‌లో పోషణ్ పక్వాడా

మడికొండ: కాజీపేట మండలం రాంపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహారానికి సంబంధించిన ఆకుకూరలు, కూరగాయలతో డెమో నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్ శారద మాట్లాడుతూ గర్భిణులు ఎక్కువగా ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు, స్థానికులు పాల్గొన్నారు.

చింతల్‌లో..

న్యూశాయంపేట: వరంగల్ నగరంలోని 36వ డివిజన్‌లోని చింతల్ –1 అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమంలో పరిశుభ్రత, ఇమ్యునైజేషన్ వంటి పలు అంశాలపై గర్భిణులు, బాలింతలు, మహిళలకు టీచర్ సునీత అవగాహన కల్పించారు.



మడికొండ: పోషణ్ పక్వాడాలో మహిళలు



న్యూశాయంపేట: అవగాహన కల్పిస్తున్న సునీత